క్లుప్తంగా

హరిదాసు సందడి



హరిదాసుకు నమస్కరిస్తున్న మహిళ

మల్కాపురం: సంక్రాంతి సమీపిస్తుండడంతో హరి కీర్తనలు ఆలపిస్తూ పారిశ్రామిక ప్రాంతంలో హరిదాసుల సందడి నెలకొంది. పలు వీధుల్లో హరిలో రంగ హరి అంటూ జపిస్తూ సోమవారం వచ్చిన ఓ హరిదాసుకు మహిళలు నమస్కరిస్తూ బియ్యం, కానుకలు సమర్పించారు. ఇలా భక్తుల నుంచి సేకరించిన బియ్యం, ఇతర సామగ్రి, కానుకలను సంక్రాంతి నాడు భద్రాచలం వెళ్లి శ్రీరామచంద్రమూర్తికి సమర్పించడం ఆనవాయితీ.

సురేష్‌కు అభినందన



శరగడం సురేష్‌ను అభినందిస్తున్న ఆడారి ఆనంద్ కుమార్

గోపాలపట్నం: విశాఖ పశ్చిమ నియోజకవర్గ క్లస్టర్ -4 యువజన విభాగం అధ్యక్షుడిగా నియామకమైన శరగడం సురేష్ సోమవారం వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్‌ను ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ సురేష్‌ను అభినందించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు వార్డు అధ్యక్షులు గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి, రమణ, తదితరులు పాల్గొన్నారు.

వాజ్‌పేయి ఆర్థిక సంస్కరణలు దేశానికి దిక్సూచి



వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రమేష్ తదితరులు

విశాఖ విద్య: మాజీ ప్రధాని మంత్రి వాజ్‌పేయి అమలు చేసిన ఆర్థిక సంస్కరణలు దేశానికి దిక్సూచిగా నిలిచాయని బీజేపీ పశ్చిమ నియోజవర్గ కన్వీనర్ దాడి పురుషోత్తం రమేష్ అన్నారు. వాజ్‌పేయి జయంతి సందర్భంగా సోమవారం జీవీఎంసీ 52వ వార్డు శివాలయం వద్ద రమేష్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనాథలకు, ఫుట్‌పాత్‌లపై ఉన్న వారికి పండ్లు,మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జీసీ నాయుడు, మంజుల, జ్యోతి, వెంకటేశ్వరావు, అప్పలరాజు, సురేష్, గణేష్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శివ పూజలు



పూజలు అందుకున్న శివలింగం

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు పవన్‌పుత్ర నగర్ వద్ద ఉన్న సరస్వతి మైదానంలో సోమవారం సాయంత్రం శివ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పారిశ్రామిక ప్రాంత నార్త్ ఇండియన్స్ ఇక్కడ మైదానం వద్ద శివ మహాపురాణం పేరిట పూజలు చేశారు. వందల సంఖ్యలో భక్తులు పాల్గొని శివనామ స్మరణ చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. ప్రతి ఏటా ఇలా పూజలు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

శ్రీరాముడిగా అప్పన్న

సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న రాపత్తు ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు సోమవారం శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి రామాలంకారంలో దర్శనమిచ్చారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని శ్రీరాముడిగా అలంకరించి శ్రీదేవి, భూదేవి సమేతంగా పల్లకీలో అధిష్ఠింపజేసి తిరువీధి నిర్వహించారు.

వావ్.. వుడా లే అవుట్



నాడు

జీవీఎంసీ 52వ వార్డులోని మర్రిపాలెం వుడా లేఅవుట్ కాలనీకి ఓ ప్రత్యేకత ఉంది. కాలుష్యం లేని ప్రాంతం కావడంతో ఇక్కడ స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకునేందుకు ఎంతోమంది ఆసక్తి చూపుతారు. క్రమపద్ధతిలో కాలనీలో అంతర్గత రహదారులు ఏర్పాటు చేసుకున్నారు. అయితే కాలనీలో మౌలిక సౌకర్యాల కల్పనపై టీడీపీ ప్రభుత్వం దృష్టిసారించలేదు. దీంతో కాలనీ అసోసియేషన్ వారే అవసరమైన పనులు చేసుకునే పరిస్థితులు ఉండేవి.

నేడు

నేడు: వుడా లే అవుట్ కాలనీ బ్రాండ్ ఇమేజ్ పెరిగింది. జీవీఎంసీ నిధులతో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డు కావడంతో పుష్కలంగా నిధులు తీసుకొచ్చి అదనపు వసతులు కల్పిస్తున్నారు. దీంతో కాలనీలోని రహదారులన్నీ అద్దంలా మెరుస్తున్నాయి. పార్కులు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయడంతో కాలనీ వాసులు ఖుష్ కడుతున్నారు.

- రూ.3.68 కోట్లతో మౌలిక సౌకర్యాలు
- అద్దంలా మెరుస్తున్న రహదారులు
- పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక ఫోకస్
- గ్రీనరీతో ఆహ్లాదకర వాతావరణం
- మోడల్ కాలనీగా అభివృద్ధి

విశాఖ విద్య: నగరంలో పేరుగాంచిన కాలనీల్లో ఒక్కటైన మర్రిపాలెం వుడా లేఅవుట్ 1985 సంవత్సరంలో ఏర్పాటైంది. ఇక్కడ ప్రస్తుతం 150 పైగా అపార్టుమెంట్లు, మరో 300 వరకు వ్యక్తిగత ఇళ్లు ఉన్నాయి. మొత్తంగా వుడా లే అవుట్‌లో 10 వేలకు పైగా జనాభా ఉన్నారు. కాలనీలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని పాస్‌పోర్టు, పీఎఫ్ కార్యాలయాలు ఉన్నాయి. ఎన్‌ఏడీకి ఆనుకుని ఉన్న ఈ వుడా లే అవుట్‌ను మోడల్ కాలనీగా తీర్చిదిద్దేందుకు డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.



రహదారులపై చెత్త తొలగిస్తున్న సిబ్బంది

డ్రైనేజీ సమస్యకు చెక్

వుడా లే అవుట్ కాలనీలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉండేది. విమానయాన సంస్థకు చెందిన స్థలం కావడంతో కాలనీ నుంచి దిగువకు డ్రైనేజీ ఏర్పాటు చేసే పరిస్థితులు లేక మురుగు నిలిచి పోయి దుర్గంధం వెదజల్లేది. స్థానిక ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ సహకారంతో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ దీనికి శాశ్వత పరిష్కారం చూపించారు. కాలనీలో డ్రైనేజీ వ్యవస్థను పటిష్టం చేశారు.

సర్వాంగ సుందరంగా పార్కులు

ఆహ్లాదకరమైన వాతావరణం ఉట్టిపడేలా పార్కులను అభివృద్ధి చేశారు. జీవీఎంసీతో పాటు వుడా కాలనీ అసోసియేషన్ వారు సైతం పార్కుల నిర్వహణ బాధ్యలు తీసుకుంటున్నారు. వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేయడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో కాలనీ వాసులతో పార్కులు సందడిగా కనిపిస్తున్నాయి.

వుడా కాలనీలో చేపట్టిన పనులు

- శివ శివానీ స్కూల్ నుంచి ఫోరెన్సిక్ ల్యాబ్ : రూ.54 లక్షలు
- ఫోరెన్సిక్ ల్యాబ్ నుంచి ఎస్‌బీఐ బ్యాంకు(పోలీసు క్వార్టర్స్ రోడ్) : రూ.42.50 లక్షల
- పాస్ పోర్టు ఆఫీసు రెహమాన్ ఇంటి వరకు బీటీ రోడ్డు:రూ.47 లక్షలు
- మెహర్ మార్గ్ రోడ్ :రూ.38 లక్షలు
- కాలనీలో అంతర్గత రహదారులు :రూ. 28 లక్షలు
- లీడర్ కార్యాలయం వెనుక రోడ్ రూ.30 లక్షలు
- శృతి టిఫిన్ రోడ్డు: రూ.39 లక్షలు
- మర్రిపాలెం వుడా లే అవుట్‌లో డ్రెన్: రూ.34 లక్షలు
- స్టెల్లా మేరీస్ ఎదుట డ్రెన్ :రూ.16 లక్షలు
- పార్కుల అభివృద్ధి, గ్రీన్ బెల్ట్ అభివృద్ధికి: రూ. 40 లక్షలు



అద్దంలా మెరుస్తున్న కాలనీప్రధాన రహదారి



పార్కులో వ్యాయామం చేస్తున్న కాలనీ వాసులు



కాలనీ నుంచి హైవేకు వచ్చే రహదారి



మర్రిపాలెం పార్కులో ఆహ్లాదంగొలిపేలా ఏర్పాట్లు

భవిష్యత్ అవసరాలు తీర్చేలా పనులు



వుడా లే అవుట్ కాలనీలో ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుంది. అందుకే ఈ కాలనీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాం. కాలనీ వాసుల భవిష్యత్ అవసరాలు తీరేలా పనులకు ప్రాధాన్యత ఇచ్చాం. జీవీఎంసీ పాలక వర్గం, వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయ కర్త ఆడారి ఆనంద్ కుమార్ సహకరించడం వల్లే ఇది సాధ్యమైంది.

– జియ్యాని శ్రీధర్, డిప్యూటీ మేయర్

అడిగిందే తడువుగా పనులు



డ్రైనేజీ సమస్యపై గతంలో ఎంతో మందికి చెప్పుకున్నాం. కానీ ఎవ్వరూ పెద్దగా పట్టించుకోలేదు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ చొరవతో దీనికి శాశ్వత పరిష్కారం లభించింది. మా కాలనీకి ఎంతో ప్రాధాన్యం ఇచ్చి అభివృద్ధి పనులు చేశారు. ఎలాంటి సమస్య అయినా అడిగిందే తడువుగా పరిష్కరిస్తున్నారు. పారిశుధ్య నిర్వహణకు ముగ్గురు పారిశుధ్య కార్మికులను నియమించుకున్నాం.

– సీహెచ్‌వీ. సురేష్, కాలనీ అసోసియేషన్ కార్యదర్శి

పార్కులు అభివృద్ధి చేశారు



కాలనీలో పార్కులను అభివృద్ధి చేయాలని ఎప్పటి నుంచో కోరుతున్నాం. కానీ గతంలో ఎవ్వరూ పట్టించుకోలేదు. ఇప్పుడు కాలనీలోని పార్కులన్నీ ఎంతో సుందరంగా తీర్చిదిద్దారు. వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేయడంతో ఎంతో ఉపయోగంగా ఉంది. అందరినీ దృష్టిలో పెట్టుకొని అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇవ్వడం చాలా సంతోషం.

-డి. లక్ష్మణరావు, వాకర్స్ అసోసియేషన్ కోశాధికారి

ఘనంగా క్రిస్మస్ సంబరాలు

- చర్చిల్లో క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలు



త్రీస్టార్ వాకర్స్ క్లబ్ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న అతిథులు, సభ్యులు



యునైటెడ్ క్రైస్ట్ చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవ సోదరులు

విశాఖ విద్య: క్రిస్మస్ పండగను సోమవారం క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం అర్ధరాత్రి నుంచే చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నూతన వస్త్రాలు ధరించి, శాంతాక్లాజ్ వేషధారణల్లో పలువురు ఏసుప్రభువు సేవలో తరించారు. ఎన్‌ఏడీ సెంటర్‌లోని సెయింట్ థామస్ చర్చి, యునైటెడ్ క్రైస్ట్ చర్చి, కరాసలోని ది పెంతికోస్తు మిషన్ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. జీవీఎంసీ 52, 90వ వార్డుల పరిధిలోని అన్ని చర్చిల వద్ద సందడి వాతావరణం కనిపించింది. ప్రార్థనల అనంతరం హ్యాపీ క్రిస్మస్,మేరీ క్రిస్మస్ అంటూ కీర్తనలు ఆలపించారు. క్రిస్మస్ పర్వదినం సందర్భంగా తన క్యాంప్ కార్యాలయంలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ కేక్ కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేశారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బీఎస్ కృష్ణకు పుష్పగుచ్ఛం అందజేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండేలా శాంతి సందేశాన్ని ఇచ్చిన ఏసు ప్రభువు అందరి పాలిట దైవంగా నిలిచారని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ అన్నారు. క్రిస్మస్ సందర్భంగా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బీఎస్ కృష్ణ ఆధ్వర్యంలో సోమవారం క్యాంపు కార్యాలయంలో ఆనంద్ కుమార్ కేక్ కట్ చేసి అందరికీ పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసుప్రభువు చూపిన శాంతి మార్గంలో ప్రతీ ఒక్కరూ నడవాలన్నారు. కులమతాలకు అతీతంగా ప్రజలంతా క్షేమంగా ఉండాలని ఏసు చూపిన బాటలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో 90వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకుడు నమ్మి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్

గోపాలపట్నం: గోపాలపట్నం పరిసరప్రాంతాల్లోని పలు చర్చిల్లో క్రిస్మస్‌ను ఘనంగా నిర్వహించారు. యువజనులు చిరు నాటికలు, భక్తి పాటలకు నృత్యాలు చేశారు. జయప్రకాశ్‌నగర్ ఎరుసలేమ్ ప్రార్థనా మందిరంలో సంఘ కాపరి సిస్టర్ ఏంజిల్ బ్లెస్సీ శాంతి ప్రబోధనలు చేశారు. లక్ష్మీనగర్ రివైవల్ హోలీ మినిస్ట్రీస్ స్టీఫెన్ పాల్ చర్చిలో పాస్టర్ స్టీఫెన్ పాల్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సేవియర్ లూథరన్ చర్చితో పాటు కొత్తపాలెం యునైటెడ్ క్రైస్ట్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

త్రీస్టార్ వాకర్స్ క్లబ్‌లో క్రిస్మస్ వేడుకలు

కంచరపాలెం: కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో త్రీస్టార్ వాకర్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు వాకర్ గుమ్మిడి అచ్చిబాబు ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి రెవరెండ్ పాస్టర్ డి.డేవిడ్‌రాజు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వాకర్స్ క్లబ్ సభ్యులకు పండ్లు, అల్పాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాకర్స్ అధ్యక్షుడు ఆర్.ఆర్.ఎస్.మహేశ్వరరావు, కె.రాజశేఖర్, బి.ఇమ్మాన్యుయేల్, సాన అప్పారావు, ఇ.ప్రకాష్‌రావు, ఏఎంబీ రావు పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రాంతంలో..

మల్కాపురం: క్రిస్మస్ సందర్భంగా పారిశ్రామిక ప్రాంతంలోని పలు చర్చిల్లో సోమవారం ప్రార్థనలు చేశారు. ఆదివారం రాత్రి నుంచి క్రైస్తవ సోదరులు చర్చిల్లో క్రీస్తును స్మరించారు. నూతన వస్త్రాలు ధరించి, కుటుంబ సభ్యులతో కలిసి ప్రార్థించారు.



కేక్ కట్ చేస్తున్న ఆనంద్ కుమార్



యునైటెడ్ చర్చిలో కీర్తనలు ఆలపిస్తున్న యువత



జయప్రకాష్ నగర్ ఎరుసలేమ్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న సిస్టర్ ఏంజెల్ బ్లెస్సీ



ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు



క్రీస్తు జన్మ వృత్తాంతం వివరిస్తూ వేసిన సెట్



సెయింట్ ఆన్స్ వద్ద ఏర్పాటు చేసి సెట్

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ అందరి బాధ్యత



1047వ రోజు ఉక్కు దీక్షలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: సర్వోన్నతమైన దేశ ఆర్థిక ప్రగతికి కార్మికులే కీలకమని, అటువంటి కార్మికులను పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వం తన ఇష్టానుసారం ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకుంటూ పోవడం సరికాదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. కార్మికులను విస్మరించిన ఏ ప్రభుత్వం బాగుపడలేదని విమర్శించారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో సోమవారం, 1047వ రోజు సంస్థకు చెందిన డబ్ల్యూఎండీ, యుటిలిటీ, ఏడీఎం, టీపీ, టీటీఐ విభాగ కార్మికులు పాల్గొని, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను 100 శాతం అమ్మాలనే నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలన్నారు. కార్మికులకు ఆర్థిక, సామాజిక న్యాయం చేస్తున్న స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవడానికి రాష్ట్రంలోని ప్రజలందరూ అనేక రూపాల్లో ఆందోళనలు చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తామని ప్రధాని స్పష్టమైన ప్రకటన చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

చెట్ల కొమ్మలు కొట్టారు.. వదిలేశారు.!



విడిచిపెట్టిన కొమ్మలు

మల్కాపురం: విద్యుత్ తీగలకు అడ్డుపడుతున్న జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం ప్రధాన మార్గంలో వందేళ్లకు పైగా వయసు గల భారీ రాగి చెట్టు కొమ్మలను నరికేశారు. ఎంతో మందికి నీడనిచ్చే చెట్టు మోడిబారడంతో పలువురు మొక్కల ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మల్కాపురం సేవా మార్గంలో భారీ రాగి వృక్షం ఉంది. ఈ వృక్షానికి సమీపాన బస్టాప్ ఉంది. ఆర్టీసీ బస్సులలో ప్రయాణించే ప్రయాణికులు తీవ్ర ఎండలో ఈ చెట్టు నీడన కాసేపు సేద తీరేవారు. అటువంటి ఈ చెట్టు కొమ్మలను మల్కాపురం విద్యుత్ శాఖ సిబ్బంది ఇటీవల తొలగించారు. అయితే ఆ వ్యర్థాలను ఇప్పటికీ తరలించలేదు. ఈ చెట్టుకు 20 అడుగుల దూరంలో విద్యుత్ తీగలు ఉన్నాయి.చెట్టు కొమ్మలు విద్యుత్ తీగలపై పడుతున్నాయన్న కారణంతో కొమ్మలతో పాటు చెట్టును దాదాపు నరికి వేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెట్ల కొమ్మలను తొలగించాలని కోరుతున్నారు.

ట్రాఫిక్ జామ్



నిలిచిన వాహనాలు



రోడ్డుకు అడ్డుగా ప్రైవేటు బస్సు

విశాఖ విద్య: ఎన్‌ఏడీ సెంటర్‌లో వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. గోపాలపట్నం నుంచి ఎన్‌ఏడీ సెంటర్ వైపు వచ్చే ఓ ప్రైవేటు బస్సు కారణంగా వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. సోమవారం ఓ ప్రైవేటు బస్సు బీఆర్‌టీఎస్ మధ్య దారిలో కాకుండా ఎడమవైపు రోడ్డులో వచ్చింది. ఎన్‌ఏడీ ఫ్లై ఓవర్ వద్ద బ్యారియర్లు ఉండడంతో బస్సును బుచ్చిరాజుపాలెం వైపు తిప్పడంతో రోడ్డుకు అడ్డంగా నిలిచింది. దీంతో వెనుక ఉన్న వాహనాలు సెయింట్ థామస్ చర్చి వరకు నిలిచిపోయాయి. చర్చిలో ప్రార్థనలు ముగించుకొని బయటకు వచ్చే వాహనదారులు అసౌకర్యానికి గురయ్యారు. ఇదిలా ఉంటే ఈ దారిలో కొంతమంది వ్యాపారుల కారణంగా తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాహనదారులు అంటున్నారు. రోడ్డుపైనే దుకాణాలు నిర్వహిస్తుండం, వారికి సంబంధించిన వాహనాలు సైతం రోడ్డుపైనే నిలుపుతుండడంతోనే సమస్య ఉత్పన్నమవుతోందని ఆరోపిస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించి, తగిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన నరసింగరావును సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

గోపాలపట్నం: ఖారవేల ఎడ్యుకేషనల్, కల్చరల్ అండ్ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం సోమవారం గోపాలపట్నం కుమారి కల్యాణ మండపంలో నిర్వహించారు. తొలుత బొడ్డేపల్లి రాజగోపాల్ చిత్రటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సభ్యుల మూజువాని ఓటింగ్‌తో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా పేడాడ నర్సింగరావు, వైస్ ప్రెసిడెంట్లుగా తమ్మినేని నర్సింగరావు, డాక్టర్ బొడ్డేపల్లి చిరంజీవి, బొడ్డే పల్లి రఘు, సనపల నరసింహస్వామి, ప్రధాన కార్యదర్శిగా పొందూరు సూర్యనారాయణ, జాయింట్ సెక్రటరీలుగా కొండాల చలమయ్య, ప్రగడ వేణుబాబు, పొన్నాడ అప్పారావు, యతిరాజుల నాగేశ్వరరావు, కోశాధికారిగా పెద్దిన బాబూరావు, కార్యనిర్వాహక కార్యదర్శిగా పప్పల రామ్మోహన రావుతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సంఘ అభివృద్ధికి కృషి చేస్తామని నూతన కార్యవర్గం తెలిపింది. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో విశ్రాంత న్యాయ మూర్తులు దుంపల ధర్మారావు, దుప్పల వాసుదేవ రావు, సింగూరు మోహనరావు, విశ్రాంత జాయింట్ కలెక్టర్ ఆరంగి జగదీష్, ప్రముఖ వ్యాపారవేత్త యాగళ్ల వివేక్, హనుమంతు ప్రసన్న కుమార్, చైల్డ్ రైట్స్ కమిషన్ సభ్యుడు గొండు సీతారామ్, వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు పేడాడ రమణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

'నేడు అడ్మిన్ కార్యాలయ ముట్టడి'

ఉక్కునగరం: జిందాల్‌తో ఒప్పందానికి వ్యతిరేకంగా మంగళవారం నిర్వహించనున్న అడ్మిన్ బిల్డింగ్ ముట్టడిని విజయవంతం చేయాలని స్టీల్ సిటూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్ కోరారు. సోమవారం జరిగిన యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నష్టదాయకమైన ఒప్పందంపై యాజమాన్యం మొండిగా వెళ్తోందని, దానికి అడ్డుకోవడానికి జరిగే కార్యక్రమం యాజమాన్యానికి, ప్రభుత్వానికి గుణపాఠంగా ఉండేలా చేయాలని సూచించారు. యాజమాన్యం ఈ అంశంపై పునరాలోచించుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ యాజమాన్యం కార్మిక సమస్యలు పట్టించుకోకుండా ఒంటెద్దు పోకడలతో ముందుకు సాగుతోందన్నారు. అధ్యక్షుడు వై.టి. దాస్ మాట్లాడుతూ ఈ నెల 27న నగరంలో జరిగే ర్యాలీని విజయవంతం చేయాలన్నారు.